## మద్దతు ధరతో ధాన్యం కొనుగోలు


స్వామివారిని దర్శించుకుంటున్న మంత్రి

- రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, శాసన సభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

మంథని, ఏప్రిల్ 17: రెండు, మూడు రోజుల్లో కనీస మద్దతు ధరతో ధాన్యం కొనుగోలు చేస్తామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల, శాసన సభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. శ్రీరామనవమి సందర్భంగా మంథని మున్సిపల్ పరిధిలోని శ్రీరాంనగర్‌లోని శ్రీ సీతారామచంద్రస్వామి దేవాలయంలో మంత్రి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో పూర్తి స్థాయిలో ఎక్కడ కూడా ఒక గింజ కూడా తరుగు లేకుండా ధాన్యం కొనుగోలు చేసేలా అధికారులను ఆదేశించామని చెప్పారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలున్నారు.


మాట్లాడుతున్న జీఎం ఎల్‌వీ సూర్యనారాయణ

## పర్యావరణ దినోత్సవంపై జీఎం సమీక్ష

యైటింక్లయిన్ కాలనీ, ఏప్రిల్ 17 : జూన్ 5న ప్రపంచ పర్యావరణ వేడుకల నిర్వహణపై ఆర్జీ-2 ఏరియా జీఎం ఎల్‌వీ సూర్యనారాయణ ఏరియా ప్రధాన అధికారులతో బుధవారం సమీక్ష నిర్వహించారు. బొగ్గు మంత్రిత్వశాఖ, తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి అనుసంధానంతో నెల పాటు నిర్వహించనున్న మిషన్‌లైఫ్ ప్రచార కార్యక్రమాలపై అధికారులకు జీఎం దిశా నిర్దేశం చేశారు. నెల పాటు కార్మికులు, కార్మిక కుటుంబాలకు పర్యావరణ పరిరక్షణకు పాటించాల్సిన పద్ధతులపై అవగాహన కల్పించాల్సిన కార్యక్రమాలపై చర్చించారు. ఇందులో పర్యావరణ పరిరక్షణకు ప్లాస్టిక్ వాడకం తగ్గించడం, స్వచ్ఛతా చర్యలు పాటించడం, ఆరోగ్యకరమైన జీవనశైలి,నీటిని పొదుపు చేయడంపై తదితర అంశాలపై ప్రజల్లోకి వెళ్లి విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. సమావేశంలో వీకేపీ ఏజెంట్ శ్రీనివాస్ రెడ్డి, ఎస్‌వోటు జీఎం ఎన్ వెంకటేశ్వర్‌రావు, వివిధ విభాగాల అధికారులు ఎర్రన్న, రాజేంద్రప్రసాద్, ధనుంజయ్ తదితరులు పాల్గొన్నారు.


## కాంగ్రెస్‌వి మోసపూరిత హామీలు

పెద్దపల్లిరూరల్, ఏప్రిల్17: కాంగ్రెస్‌వి మోసపూరిత హామీలని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు కొంకటి లింగమూర్తి అన్నారు. ఎన్నికల్లో ఓట్లు, సీట్ల కోసం తప్పుడు వాగ్దానాలతో ప్రజలను మోసగిస్తున్నదని విమర్శించారు. మండలంలోని బ్రాహ్మణపల్లిలో బుధవారం ఆయన మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా ప్రస్తుతం ఎన్నికల కోసం వస్తున్న కాంగ్రెస్ నాయకులను ప్రజలు చీత్కరిస్తున్నారన్నారు. కాంగ్రెస్ విధానాలపై మండి పడ్డారు. లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలో ఎక్కువ సీట్లు గెలిచేది బీఆర్‌ఎస్ పార్టీయేని ఆశాభావం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలను పూర్తిస్థాయిలో అమలు చేయడం లేదని మండిపడ్డారు. కాంగ్రెస్ నాయకులు గ్రామాల్లోకి వెళ్తే ప్రజలు, రైతుల బాధలు తెలుస్తాయన్నారు. రూ. 10 లక్షల బీమా పథకాన్ని బీఆర్‌ఎస్ ఎన్నికలకు మూడు నెలల ముందే ప్రకటించిందని గుర్తు చేశారు. తప్పుడు వాగ్ధానాలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌కు పరాభవం తప్పదన్నారు.

## ప్రధాన రహదారి వెంట మోడు వారిన వృక్షాలు

- ఎప్పుడు కూలి పోతాయో తెలియక భయాందోళనకు గురవుతున్న ప్రయాణికులు


ప్రధాన రహదారిపై మోడు వారిన చెట్లు



మంథని, ఏప్రిల్ 17: మంథని-కాటారం ప్రధాన రహదారి , మంథని-పెద్దపల్లి ప్రధాన రహదారి వెంట రహదారులకు ఇరువైపులా పెద్ద సంఖ్యలో వృక్షాలు మోడువారి పోయి ప్రమాదకరంగా మారాయి. మంథని-కాటారం ప్రధాన రహదారి వెంట మంథని మండలంలోని ఎగ్లాస్‌పూర్ గాడుదలగుంట దాటిన తరువాత పదుల సంఖ్యలో భారీ వృక్షాలు మోడు వారి పోయి ఉన్నాయి. చాలా ఏళ్లుగా ఆ చెట్లు ఎండి పోయి ఉండడంతో పాటు చెదలు సైతం పట్టి ప్రమాదకరంగా మారాయి. చిన్న పాటి గాలి దుమారం వీచినా ఆ చెట్లు కూలి పోయేలా శబ్ధాలు వస్తున్నాయి. ఈ చెట్లు ఇలాగే ఉంటే అనుకొని సందర్భాల్లో రోడ్డుపై పడి ప్రయాణికుల ప్రాణాలకు సైతం నష్టం వాటిల్లే ప్రమాదమున్నదని వాహనచోదకులు, ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అదే విధంగా మంథని-పెద్దపల్లి ప్రధాన రహదారి వెంట పట్టణ శివారులో సైతం కొన్ని చెట్లు మోడువారి పోయి దర్శనమిస్తున్నాయి. రహదారి వెంట ఇలా ప్రమాదకరంగా భారీ వృక్షాలు మోడు వారి పోయి ఉన్నప్పటికీ అటవీ శాఖ అధికారులు పట్టించుకోక పోవడంపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అటవీ శాఖ అధికారులు స్పందించి మోడువారి న ఈ భారీ వృక్షాలను వెంటనే తొలగించాలని ప్రయాణికులు, వాహన చోదకులు కోరుతున్నారు.

## కలవరపెడుతున్న కామెర్లు

- సుమారు వంద మందికి వ్యాధి
- ఇప్పటికే ముగ్గురు మృతి
- అడ్డుకట్ట వేయడంలో వైద్యాధికారులు విఫలం


చిన్నారి కోడూరి దీప్తి

జూలపల్లి, ఏప్రిల్ 17: రెండునెలలుగా మండలంలో విస్తరిస్తున్న పచ్చ కామెర్ల వ్యాధి కలవరపెడుతున్నది. చిన్నాపెద్దా తేడాలేకుండా వ్యాధి బారినపడుతున్నారు. ప్రాథమిక దశలో గుర్తించక ప్రాణాలమీదికి తెచ్చుకుంటున్నారు. ఇప్పటికే సుమారు వంద మంది ఈ వ్యాధితో బాధపడుతుండగా ఇటీవలే ముగ్గురు మరణించారు. చాలా మంది ప్రైవేట్ దవాఖానలు, ఆయుర్వేదం, నాటు వైద్యులను ఆశ్రయించి చికిత్స పొందుతున్నారు. అయితే ప్రాణాంతకమైన ఈ వ్యాధి నిర్మూలనపై వైద్యాధికారులు దృష్టిపెట్టడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. నెల కిందట అబ్బాపూర్‌లో బొంగాని రాజేశంగౌడ్ (65) ఆరోగ్య పరిస్థితి విషమించి చనిపోయాడు. కోనరావుపేటలో గుండ విష్ణు (16) అనే విద్యార్థి ఈ నెల 4న కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ మరణించాడు. వ్యాధి నయంకావడంలేదనే మనస్తాపంతో పెద్దాపూర్ గ్రామానికి చెందిన కాంపెల్లి నవీన్ (23) ఈ నెల 4న పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుని చికిత్స పొందుతూ ఈ నెల 5న మృతి చెందాడు. గ్రామానికో 5 నుంచి 10 మంది దాకా పచ్చకామెర్ల వ్యాధి సోకి బాధపడుతున్నారు. జ్వరం, ఒళ్లు నొప్పులు, వాంతులు, ఆకలి తగ్గడంతో కరీంనగర్, పెద్దపల్లి, గోదావరిఖని ప్రాంతాల్లోని ప్రైవేట్ దవాఖానలకు వెళ్తున్నారు. కలుషిత ఆహారం, తాగునీరు. కల్తీ నూనె, ఆల్కాహాల్ తదితర కారణాలతో కామెర్ల వ్యాధి సోకుతుందని వైద్యులు చెబుతున్నారు. ఈ రోగాన్ని కట్టడి చేసేందుకు వైద్యాధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు

## పారదర్శకంగా నామినేషన్ల స్వీకరణ


వీసీలో పాల్గొన్న కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్, అదనపు కలెక్టర్లు, అధికారులు

పెద్దపల్లి, ఏప్రిల్17: లోక్ సభ ఎన్నికల నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ పూర్తిపారదర్శకంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్ సూచించారు. నామినేషన్ల స్వీకరణ, తుది ఓటరు జాబితా రూపకల్పనపై జిల్లా ఎన్నికల అధికారులతో బుధవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. వీసీలో పెద్దపల్లి కలెక్టరేట్ నుంచి కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్, అదనపు కలెక్టర్లు జే అరుణశ్రీ, జీవీ శ్యామ్ ప్రసాద్ లాల్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి మాట్లాడుతూ, పెండింగ్ ఓటర్ నమోదు దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. ముందస్తుగానే ఓటరు స్లిప్పులను పంపిణీ చేపట్టాలన్నారు. నామినేషన్ స్వీకరణ, స్క్రూటినీ, ఉపసంహరణ, పోటీ చేసే అభ్యర్థుల తుది జాబితా ప్రకటన, స్వతంత్ర అభ్యర్థులకు గుర్తుల కేటాయింపు, బ్యాలెట్ పేపర్ రూపకల్పన వంటి అంశాలను ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల ప్రకారం పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. పోటి చేసే అభ్యర్థుల సహాయార్థం హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయాలన్నారు. నామినేషన్ స్వీకరణ ప్రక్రియ పూర్తి స్థాయిలో వీడియో, ఫొటోలు తీయాలన్నారు. రిటర్నింగ్ అధికారి చాంబర్‌లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. నామినేషన్ అభ్యర్థుల అఫిడవిట్లు పారదర్శకంగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని స్పష్టం చేశారు. వీసీ అనంతరం జిల్లా కలెక్టర్, సంబంధిత అధికారులతో మాట్లాడారు. నామినేషన్లు దాఖలు సమయంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని, అభ్యర్థి ప్రతిజ్ఞ రిటర్నింగ్ అధికారి ముందు చేసేలా ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రతిరోజు నమోదు అవుతున్న నామినేషన్లు సెట్ల వారీగా సమాచారం పకడ్బందీగా నమోదు చేయాలని, అభ్యర్థి ఫోటో, సాఫ్ట్ కాపీ, హార్డ్ కాపీ తీసుకోవాలన్నారు. నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగిసిన తర్వాత పోటీ చేసే అభ్యర్థుల జాబితా ప్రకటించడం జరుగుతుందన్నారు. సమావేశంలో పెద్దపల్లి, మంథని ఆర్డీవోలు బీ గంగయ్య, హనుమా నాయక్, కలెక్టరేట్ ఏవో శ్రీనివాస్, సీ విభాగం సూపరింటెండెంట్ బీ ప్రకాష్, తహసీల్దార్లు రాజ్ కుమార్, కుమారస్వామి, , ఎలక్షన్ డీటీ ప్రవీణ్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.


నమస్తే తెలంగాణ CLASSIFIED

WANTED

jobs Apply Now!

★KFC Hiring P/F Time Jobs in Hyd. SSC Pass, 18 yrs Abv. M&F. 13k with Food & Accom. PF/ Medical/ Bonus/ Incentive. Ph: 9392526486, 9704449461, 8688442326.
NT-136-All

WANTED


★హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి భోజనం. జీతం: 16K to 18K, ఏజెంట్ కమీషన్ 6K Ph: 9640258899/9640468899
NT-311829

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.






భక్తులకు తాళిబొట్టు చూపుతున్న అర్చకులు

## కనుల పండువగా సీతారాముల కల్యాణం

శ్రీరామ నమమి సందర్భంగా జిల్లాలో సీతారాముల కల్యాణోత్సవం కనుల పండువగా సాగింది. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి కల్యాణోత్సవాన్ని తిలకించారు. స్వామివారలకు కానుకలు సమర్పించారు. మంథనిలో మంత్రి శ్రీధర్‌బాబు, ధర్మారంలో ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్, నంది మేడారం జూనియర్ సివిల్ కోర్టు జడ్జి వెంకట్ సచిన్ రెడ్డి, పెద్దపల్లిలో ఎమ్మెల్యే సీహెచ్ విజయరమణారావు, గోదావరిఖనిలో రామగుండం ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్‌ఠాకూర్ దంపతులు హాజ రయ్యారు. గోదావరిఖని కోదండరామాలయంలో నిర్వహించిన వేడు కల్లో ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ దంపతులు పట్టు వస్త్రాలు, మంగళ సూత్రం సమర్పించారు.

- నమస్తే తెలంగాణ నెట్‌వర్క్


పట్టు వస్త్రాలు తెస్తున్న ఎమ్మెల్యే దంపతులు


కల్యాణోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే విజయరమణారావు

## వాఖానలో అగ్నిప్రమాదాలపై అవగాహన

ఫర్టిలైజర్‌సిటీ, ఏప్రిల్ 17: అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా బుధవారం పట్టణంలోని మార్కండయకాలనీలోని స్టార్ మౌంట్ దవాఖానలో బుధవారం గోదావరిఖని ఫైర్‌స్టేషన్ ఆధ్వర్యంలో అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. వైద్యులు, పారామెడికల్ సిబ్బందికి, రోగులకు ప్రమాదవశాత్తు దవాఖానలో జరుగు అగ్నిప్రమాదాలను ఎలా నివారించాలో డెమోను ప్రదర్శిం చారు. ఇక్కడ ఫైర్‌స్టేషన్ ఆఫీసర్ ఆర్ సత్యనారాయణ, సిబ్బంది పీ సత్తయ్య, బీ శ్రీనివాస్, టీ అశోక్, బీ సంతోష్, నాగేంద్ర, వైద్యులు, సిబ్బంది ఉన్నారు.

## చికిత్సపొందుతూ ఒకరి మృతి

ఫర్టిలైజర్‌సిటీ, ఏప్రిల్ 17: గోదావరిఖని లక్ష్మీనగర్‌కు చెందిన సలీమ్ (50) రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి హైదరాబాద్ గాంధీ దవాఖానలో చికిత్సపొందుతూ బుధవారం మృతిచెందాడు. ఓ టెంట్‌హౌజ్‌లో పనిచేసే సలీమ్ రెండురోజుల క్రితం టెంట్ సామన్లతో ట్రాలీలో ప్రయాణిస్తుండగా గౌతమినగర్‌లో ట్రాలీ బొల్తాపడింది. దీంతో తలకు బలమైన గాయమైంది. దవాఖానలో చికిత్సపొందు తుండగా పరిస్థితి విషమించి చనిపోయాడు.

## కాంట్రాక్టు కార్మికుల నుంచి రికవరీ రద్దు చేయాలి

రామగిరి, ఏప్రిల్ 17: సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులు ఒకరోజు డ్యూటీ కి రాకపోతే పెనాల్టీల పేరిట రికవరీ చేయడాన్ని రద్దు చేయాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకుల వెంకన్న కోరారు. ఈ మేరకు సంస్థ డైరెక్టర్ పా ఎన్‌వీకే శ్రీనివాస్‌కు వినతి పత్రం అంద శారు. యాజమాన్యం 2023లో కాంట్రాక్టర్లకు సర్క్యూలర్ జారీ చేయడం వల్ల ప్రతి రోజు రావల్సిన కార్మికుల సంఖ్య తగ్గితే ప్రతి మస్టర్‌కు రూ.300 రికవరి చేయాలని సర్క్యూలర్ జారీ చేసిందని, దాంతో కాంట్రాక్టర్లు విధులకు ఒకరోజు రాకపోతే పెనాల్టీల పేరిట కార్మికుల నుంచి రూ.475 రికవరి చేస్తున్నారని, వెంటనే ఈ పద్ధతిని రద్దు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

## ప్రమాదవశాత్తు ఇల్లు దగ్ధం

సుల్తానాబాద్‌రూరల్,ఏప్రిల్17: మియ్యాపూర్ గ్రామానికి చెందిన ఎర్రంశెట్టి లచ్చయ్య ఇల్లు ప్రమాదవశాత్తు కాలి బూడిదైంది. బుధవారం ఇంట్లో ఎవరూ లేని సమ యంలో గునపెంకుటి ఇల్లు ప్రమాదవశాత్తు మంటలు చెలరేగాయి. ఇంటితో పాటు ఇంట్లోని సామగ్రి, ఫర్నిచర్, దుస్తులు, కాలిపోయాయి. ఏలా మంటలు వ్యాపించాయనే విషయం తేలియడం లేదని లచ్చయ్య వాపోయాడు. దాదాపుగా రూ. 2లక్షల వరకు అస్తి నష్టం వాటిల్లినట్లు బాధితుడు పేర్కొన్నాడు.

## మురిపించిన బస్సు కనిపించకపాయే



బాలరాజ్‌పల్లిలో బస్సు వద్ద గ్రామస్తులు (ఫైల్ )

జూలపల్లి, ఏప్రిల్ 17 : మండలంలోని బాలరాజ్‌పల్లి గ్రామస్తుల బస్సు సౌకర్యం ముచ్చట తీరలేదు. అధికారులు ఒకే ఒక్క రోజు ఆర్టీసీ బస్సు నడిపి రద్దు చేశారు. వివిధ ప్రాంతాలకు వెళ్లి వచ్చే ప్రయాణికులు బస్సు కోసం ఎదురు చూసి అవాక్కయ్యారు. మార్చి 17న గోదావరిఖని డిపోకు చెందిన బస్సు గ్రామానికి చేరుకోవడంతో గ్రామస్తులు స్వాగతం పలికి సంబరపడిపోయారు. ఏండ్ల తరబడి బస్సు సౌకర్యం లేక ఇబ్బందులు పడిన గ్రామస్తులు పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావుకు విజ్ఞప్తి చేశారు. ఈ క్రమంలో ఎమ్మెల్యే స్పందించి ఆర్టీసీ అధికారులతో మాట్లాడి బస్సు వేయించారు. ప్రతి రోజు గోదావరిఖని నుంచి పెద్దపల్లి, జూలపల్లి మీదుగా చొప్పదండికి వెళ్లి వచ్చే బస్సును బాలరాజ్‌పల్లి దాకా పొడిగించారు. క్రమం తప్పకుండా ఆ గ్రామానికి రోజూ బస్సు నడపాలని ఎమ్మెల్యే ఆదేశించగా ఒక్క రోజుకే మమ అనిపించారు. ఒక్క రోజే మురిపించిన బస్సు మళ్లీ కనిపించకపోవడంతో గ్రామస్తుల నుంచి నిరసన వ్యక్తమవుతున్నది.ఎమ్మెల్యే, ఆర్టీసీ అధికారులు స్పం దించి బస్సు నడపాలని గ్రామస్తులు కోరుతున్నారు.


పారిశుధ్య పనులు పరిశీలిస్తున్న డీఎల్‌పీవో వేణుగోపాల్

## చీమలపేటలో డీఎల్‌పీవో పర్యటన

జూలపల్లి, ఏప్రిల్ 17 : మండలంలోని చీమలపేట గ్రామాన్ని పెద్దపల్లి డీఎల్‌పీవో వేణుగోపాల్ బుధవారంసందర్శించారు. ఇటీవల డెంగీ సోకి ఏగుర్ల రాజు, ఏగుర్ల గట్టయ్య అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఈ క్రమంలో డీఎల్‌పీవో వారిద్దర్ని పరామర్శించి ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. వాడ వాడలా చేపడుతున్న పారిశుధ్య పనులు పరిశీలించారు. జ్వారాలను అదుపు చేయడానికి అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ఇక్కడ ఎంపీవో కిరణ్, పంచాయతీ కార్యదర్శి సంధ్యారాణి, ఏఎన్‌ఎం, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

## సీఆర్వో డివిజన్ అధ్యక్షుడిగా విద్యాసాగర్


విద్యాసాగర్

ముత్తారం, ఏప్రిల్ 17: వినియోగదారుల హక్కుల సమితి మంథని డివిజన్ అధ్యక్షుడిగా మండలంలోని గ్రామానికి చెందిన చిగురు విద్యాసాగర్ నియమితుల య్యారు. తనపై నమ్మకంతో డివిజన్ బాధ్యతలు అప్పగించిన జాతీయ అధ్యక్షుడు నవీన్ శర్మ, రాష్ట్ర అధ్యక్షుడు హరి బాబు, జిల్లా అధ్యక్షుడు శ్రీని వాస్‌కు విద్యాసాగర్ కృతజ్ఞతలు తెలిపారు. వినియోగదారులకు ఏ సమస్య వచ్చినా ముందుండి పోరాడుతానని తెలిపారు.

## వడదెబ్బతో యువకుడి మృతి

జ్యోతినగర్, ఏప్రిల్ 17: ఎన్టీపీసీ జంగాలపల్లికి చెందిన మేకల రవికుమార్(32) మంగళవారం అర్ధరాత్రి మృతిచెందినట్లు ఎన్టీపీసీ ఏఎస్‌ఐ రాయిస్ అహ్మద్ తెలిపారు. పశువుల(బర్రెలు) మేత కోసం పశువులను తీసుకోని బయటకు వెళ్లిన రవికుమార్ తిరిగి ఇంటికి విచ్చేయగా వడదెబ్బ తగిలి రాత్రి ఇంట్లో మృతిచెందాడు. తండ్రి లింగయ్య ఫిర్యాదు మేరకు ఏఎస్‌ఐ కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

## చలివేంద్రం ప్రారంభం

ధర్మారం,ఏప్రిల్17: మండల కేంద్రంలోని స్టేట్ బ్యాంక్ సమీపంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ బుధవారం ప్రారంభించారు. నిర్వాహకులను విప్ అభినందించారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు గాగిరెడ్డి తిరుపతి రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

## భక్తాంజనేయస్వామి ఆలయంలో చోరీ

ఫర్టిలైజర్‌సిటీ, ఏప్రిల్ 17: గోదావరిఖని అడ్డగుంటపల్లిలోని శ్రీ భక్తాంజనేయస్వామి ఆలయంలో బుధవారం తెల్లవారుజామున గుర్తు తెలియని దొంగలు చొరబడి విగ్రహానికి ఉన్న వెండి నామం, కడియాలు, నగదు, నాణేలను అపహరించారు. దొంగలు ఆలయంలోని గర్భగుడి తలపులు వంచి లోనికి ప్రవేశించి చోరీకి పాల్పడ్డారు. ఆలయ అర్చకులు దామోదరాచార్యులు గోదావరిఖని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు విచారణ చేపట్టారు.

## నీటిని పొదుపుగా వాడుకోవాలి

యైటింక్లయిన్ కాలనీ ఏప్రిల్ 17 : సింగరేణి సంస్థ ఆర్జీ-2 ఏరియాలోని కార్మిక కుటుంబాలు నీటిని పొదుపుగా వాడుకోవాలని డీజీఎం(ప) జీ. రాజేంద్రప్రసాద్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గోదావరినది ఇన్‌టెక్‌వెల్ వద్ద మోటారు మరమ్మత్తులు ఉన్నందున, గోదావరిఖని నుండి కాలనికి వచ్చే పైప్‌లైన్ లీకేజీ మరమ్మత్తుల దృష్ట్యా నీటి సరఫరాలో అంతరాయం ఉన్నట్లు తెలిపారు. దీని వల్ల పది రోజులపాటు రోజు విడిచి రోజు పోతన కాలని, 8వ కాలని కార్మిక కుటుంబాలకు నీటిని సరఫరా చేయనున్నట్లు తెలిపారు. కావున కార్మిక కుటుంబాలు నీటిని పొదుపుగా వాడుకుని సహకరించాలని కోరారు.